

హయత్‌నగర్ బస్టాండ్‌లో వేచిచూస్తున్న ప్రయాణికులు

ఆదివారమూ అదే రద్దీ..!

● ఓటు కోసం వెళ్లిన నగరవాసులు

హయత్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): ఓట్ల పండుగ నేపథ్యంలో ఆదివారం కూడా నగరం నుంచి ప్రజలు తమ స్వగ్రామాలకు భారీగా తరలివెళ్లారు. దీంతో బస్టాండ్లలో విపరీతమైన రద్దీ కనిపించింది. హయత్‌నగర్, ఎల్బీనగర్, వనస్థలిపురంలోని బస్‌స్టాపుల ద్వారా ఉదయం నుంచి రాత్రి వరకు ఆర్టీసీ బస్సులతోపాటు ప్రైవేట్ వాహనాల్లో వేలాది మంది వెళ్లిన పరిస్థితి కనిపించింది. హైదరాబాద్-విజయవాడ మార్గంలోని నల్లగొండ, నకిరేకల్, మిర్యాలగూడ, నార్కట్‌పల్లి, చిట్యాల, చౌటుప్పల్ తదితర గ్రామాలకు చెందిన ప్రజలు నగరంలోని హయత్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్, చైతన్యపురి, కొత్తపేట్ ప్రాంతాల్లో నివాసముండి వివిధ రకాల వృత్తులు చేస్తుంటారు. అయితే గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఓటు వేసేందుకు వెళ్లిన ప్రజలు.. తాజాగా పార్లమెంట్ ఎన్నికల్లో కూడా ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు వెళ్లడంతో నగరంలోని ఆయా ప్రాంతాల్లో ఆదివారం జన సంచారం తక్కువైంది. అయితే నగరవాసులు స్వగ్రామాలకు వెళ్లడంతో గ్రేటర్‌లోని ఆయా పార్లమెంట్ సెగ్మెంట్లలో పోలింగ్‌శాతం తగ్గడంతోపాటు నల్లగొండ, భువనగిరి స్థానాల్లో పెరిగే అవకాశం ఉంది.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌రెడ్డి

చేవెళ్లను మోదీకి బహుమతిగా ఇస్తాం

● బీజేపీ రాష్ట్ర నేత శంకర్‌రెడ్డి

సరూర్‌నగర్, మే 12(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పార్లమెంటు స్థానంలో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకుని, ఈ స్థానాన్ని ప్రధాని మోదీకి బహుమతిగా ఇస్తామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, పార్టీ మీర్‌పేట్ కార్పొరేషన్ ఇన్‌చార్జి కొలన్ శంకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మీర్‌పేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలంతా మరోసారి మోదీ నాయకత్వాన్ని బలంగా కోరుకుంటున్నారని, చేవెళ్లలోనూ మోదీ హవా కొనసాగనున్నదని అన్నారు. ఎవరు ఎన్ని ప్రలోభాలకు గురి చేసినా లొంగకుండా ప్రతి ఒక్కరూ దేశ ప్రగతిని దృష్టిలో పెట్టుకుని బీజేపీకి ఓటెయ్యాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీజేపీ మీర్‌పేట్ శాఖ అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కీసరి గోవర్ధన్‌రెడ్డి, పార్టీ నాయకులు సూల ప్రభాకర్, కె.సోమేశ్వర్, గాజుల మధు, ఆర్.యాదగిరియాదవ్ పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న కమిటీ సభ్యులు

ఘనంగా విజయ దుర్గామాత ఆలయ వార్షికోత్సవం

సైదాబాద్, మే 12(ఆంధ్రజ్యోతి): సైదాబాద్ మాతామైదాన్‌లోని విజయ దుర్గామాత ఆలయ 19వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు ప్రారంభించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సైదాబాద్, మాదన్నపేట పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి స్వర్ణలత, ఆలయ కమిటీ సభ్యులు రవిశంకర్, సంగీత, యాదగిరిగౌడ్, సునీల్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, గాదె సంజయ్ పాల్గొన్నారు.

టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా దుర్గారెడ్డి



చంపాపేట, మే 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(టీపీసీసీ)రాష్ట్ర కోఆర్డినేటర్‌గా కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ మాజీ ధర్మకర్త, చంపాపేట డివిజన్ మల్‌రెడ్డి రంగారెడ్డినగర్ కాలనీకి చెందిన ఎన్.దుర్గారెడ్డి నియమితులయ్యారు. టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ శనివారం కోఆర్డినేటర్‌గా నియమిస్తూ దుర్గారెడ్డికి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దుర్గారెడ్డి మాట్లాడుతూ తనను రాష్ట్ర కోఆర్డినేటర్‌గా నియమించినందుకు గాను సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్క, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, మాజీ ఎంపీ మల్లు రవి, టీపీసీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, నాయకులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ సామ రమణారెడ్డి, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, జిట్టా సురేందర్‌రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు.



సర్టిఫికెట్లతో చిన్నారులు, చిత్రంలో జగన్‌మోహన్‌రెడ్డి

స్ఫూర్తి కాలేజీలో ముగిసిన సమ్మర్ క్యాంప్

● చిన్నారులకు సర్టిఫికెట్ల ప్రదానం

సరూర్‌నగర్, మే 12(ఆంధ్రజ్యోతి): బాలాపూర్ మండలం నాదర్‌గుల్‌లోని స్ఫూర్తి ఇంజనీరింగ్ కాలేజీలో వేసవి సెలవును పురస్కరించుకుని చిన్నారులకు వారం రోజుల పాటు నిర్వహించిన సమ్మర్ క్యాంప్ ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ముగింపు కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల కార్యదర్శి ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లలు వేసవి సెలవులను వృథా చేయకుండా ఉండేందుకు గాను ఈ క్యాంపు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. పిల్లల్లో సృజనాత్మకతను, నైపుణ్యాన్ని పెంపొందించడమే ఈ క్యాంపు లక్ష్యమని ఆయన అన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మహేశ్వరదత్త, గాయత్రీపావని, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడి మృతి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మే 12 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ మరణించాడు. ఈ సంఘటన సీతాఫల్‌మండి రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. సీతాఫల్‌మండి - మల్కాజిగిరి రైల్వే స్టేషన్‌ల మధ్యలో ఆదివారం సాయంత్రం 4.30 గంటల సమయంలో గుర్తుతెలియని 75ఏళ్ల వ్యక్తి రైలు ఢీకొని తీవ్ర గాయాలతో కంకరాళ్ల వద్ద అపస్మారక స్థితిలో పడిపోయి ఉన్నట్లు స్థానికుల సమాచారం మేరకు రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వృద్ధుడిని వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రిలో చేర్పించగా సాయంత్రం 5.50 గంటలకు చికిత్స పొందుతూ మరణించాడు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. ఈ వ్యక్తి ఆచూకీ తెలిస్తే వెంటనే సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

ఎల్‌బీనగర్ సెగ్మెంట్‌లో ఏర్పాట్లు పూర్తి ● 571 పోలింగ్ బూత్‌లు

● సమస్యాత్మక ప్రాంతాలుగా 71 బూత్‌ల గుర్తింపు
● ఓటు హక్కు వినియోగించుకోనున్న 6,04,763 మంది ఓటర్లు
● వెబ్‌కాస్టింగ్ ద్వారా చిత్రీకరణ



పోలింగ్ సామగ్రిని పరిశీలించుకుంటున్న పోలింగ్ సిబ్బంది

ఎల్‌బీనగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): దేశంలోని లోక్‌సభ నియోజకవర్గాల్లో అతిపెద్దది అయిన మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఎల్‌బీనగర్ అసెంబ్లీ సెగ్మెంట్ సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి పంకజ ఆధ్వర్యంలో పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ జరుగనుంది. ఎల్‌బీనగర్ సెగ్మెంట్‌లోని సుమారు 6,04,763 మంది ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోనున్నారు. వారిలో 3,14,101 మంది పురుషులు కాగా 2,90,528 మహిళలు, 61 మంది సర్వీస్ ఓటర్లు, 134 మంది ఇతర ఓటర్లున్నారు. వీరి కోసం సెగ్మెంట్ పరిధిలో 571 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. వీటిలో 71 పోలింగ్ బూత్‌లు సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. నోడల్ అధికారులకు ఎన్నికలకు సంబంధించిన వివిధ విభాగాల బాధ్యతలను అప్పగించారు. పోలింగ్ తీరును 25మంది మైక్రోఅబ్జర్వర్లు పరిశీలించనున్నారు. 571 పోలింగ్‌బూత్‌లతో కూడిన ఎల్‌బీనగర్ సెగ్మెంట్‌ను 51 సెక్టార్లు విభజించి సెక్టోరల్ ఆఫీసర్లను 571 మంది బూత్ లెవల్ ఆఫీసర్లను ఏర్పాటు చేశారు. అదేవిధంగా 51 రూట్‌లుగా విభజించి 51మంది రూట్ ఆఫీసర్లను ఏర్పాటు చేశారు. వీరంతా పోలింగ్ రోజున జోనల్ ఆఫీసర్ బాధ్యతలను నిర్వహించి పోలింగ్ సరళిని పరిశీలించనున్నారు.

సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం నుంచి పోలింగ్ సామగ్రి పంపిణీ

ఎల్‌బీనగర్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో పోలింగ్‌కు అవసరమైన సామగ్రి, సిబ్బంది కేటాయింపు పనులను సరూర్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియం నుంచి నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలో 571 పోలింగ్ బూత్‌లకు గాను ఒక్కో బూత్‌కు ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్, మరొక అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్, ఇంకో ఇద్దరు పోలింగ్ సిబ్బందితో పాటు ఒక్కో వలంటీర్లను కేటాయించారు. 58 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లు, 58 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు, 116 మంది ఇతర పోలింగ్ అధికారులతో పాటు పోలింగ్ కేంద్రానికి ఇద్దరు చొప్పున 1142 పోలీస్ సిబ్బందిని వినియోగించనున్నారు. ఎల్‌బీనగర్ సెగ్మెంట్‌కు 1428 ఈవీఎం బ్యాలెట్ యూనిట్లు, 713 కంట్రోల్ యూనిట్లు, 799 వీవీ ప్యాట్స్‌ను కేటాయించారు. ఎల్‌బీనగర్ అసెంబ్లీ స్థానానికి 48మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. దీంతో ఒక ఈవీఎంకు బదులు నాలుగు ఈవీఎంలను ఏర్పాటు చేశారు.

వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ చిత్రీకరణ

నియోజకవర్గంలోని 571 పోలింగ్ కేంద్రాలలో జరిగే పోలింగ్ తీరుతెన్నులను వెబ్‌కాస్టింగ్ ద్వారా చిత్రీకరించనున్నారు. అందుకు గాను 571 కేంద్రాలలో వెబ్‌కెమరాలను అమర్చనున్నారు. అంతే కాకుండా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలతోపాటు మూడు పోలింగ్ కేంద్రాల కంటే ఎక్కువగా ఉన్న 390 పోలింగ్ కేంద్రాలున్న 145 ప్రాంతాలలో పోలింగ్ కేంద్రం వెలుపల వెబ్‌కెమరాలను ఏర్పాటు చేసి పోలింగ్ తీరుతెన్నులను చిత్రీకరించనున్నారు.



పోలింగ్ సామగ్రిని తీసుకెళ్తున్న పోలింగ్ సిబ్బంది

ఇండోర్ స్టేడియానికే ఈవీఎంలు

సోమవారం పోలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని 571 పోలింగ్ బూత్‌లకు చెందిన ఈవీఎంలను సరూర్‌నగర్‌లోని ఇండోర్‌స్టేడియానికి తీసుకొచ్చి పటిష్టమైన భద్రత మధ్య భద్రపర్చనున్నట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి పంకజ తెలిపారు. ప్రత్యేక స్ట్రాంగ్ రూంలో భారీ పోలీస్ బందోబస్తు నడుమ ఈవీఎంలను భద్రపరచి జూన్ 4న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు ఆయన వివరించారు.

భద్రత కట్టుదిట్టం

పోలింగ్ ప్రశాంతంగా జరగడానికి పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. ఎల్‌బీనగర్ డీసీపీ సీహెచ్ ప్రవీణ్‌కుమార్ పర్యవేక్షణలో ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య ఆధ్వర్యంలో స్థానిక పోలీసులతో పాటు సీఐఎస్‌ఎఫ్ కేంద్ర బలగాలను కూడా వినియోగిస్తున్నారు.

త్రిముఖ పోటీ..

ఈ ఎన్నికల్లో మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గంలో పోటీ చేసే అభ్యర్థులు 22 మంది బరిలో ఉన్నప్పటికీ ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్‌ల మధ్యనే పోటీ నెలకొంది. అభ్యర్థుల హామీలపై ఓటర్లు సోమవారం తమ తీర్పును ఓటు ద్వారా ఇవ్వనున్నారు.

డీఆర్‌ఎస్ కేంద్రాన్ని సందర్శించిన అధికారులు

సరూర్‌నగర్ స్టేడియంలోని డీఆర్‌సీ కేంద్రాన్ని రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్‌జోషి ఆదివారం సందర్శించారు. పోలింగ్ సిబ్బందికి పోలింగ్ సామగ్రి పంపిణీ తీరును వారు పరిశీలించారు. పోలింగ్ సామగ్రిని పోలింగ్ కేంద్రాలకు చేరవేత మొదలుకుని తిరిగి డీఆర్‌సీ కేంద్రానికి తీసుకొచ్చే వరకు పటిష్ట భద్రత కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. ఈవీఎంలను గట్టి భద్రత నడుమ తరలిస్తున్నట్లు ఆయన చెప్పారు.

అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో 163 పోలింగ్ స్టేషన్లు

● 1,73,000 మంది ఓటర్లు

అబ్దుల్లాపూర్‌మెట్, మే 12(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో ఎంపీ ఎన్నికల పోలింగ్‌కు అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. సోమవారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ జరుగనుంది. మండలంలో మొత్తం 1,73,000 మంది ఓటర్లు ఉన్నారు. 163 పోలింగ్ స్టేషన్లను అధికారులు ఏర్పాటు చేశారు. ఆదివారం సాయంత్రం పోలింగ్ అధికారులు, సిబ్బంది ఈవీఎం మిషన్‌తో పాటు పోలింగ్ సామగ్రితో ఆయా స్టేషన్లకు చేరుకున్నారు. ఆయా స్టేషన్ల వద్ద పోలీసులు 144 సెక్షన్ విధించారు. పోలింగ్ కేంద్రానికి సుమారు 100 మీటర్ల దూరంలో రాజకీయ పార్టీల నేతలు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టకుండా ఆంక్షలు విధించారు.



బలిజగూడ పోలింగ్ స్టేషన్‌లో ఏర్పాట్లు చేస్తున్న పోలింగ్ అధికారులు, సిబ్బంది

కొత్తపేటలో 49 పోలింగ్ స్టేషన్లు

● 50,307 మంది ఓటర్లు

కొత్తపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట- 21 (డివిజన్)పరిధిలోని 49 పోలింగ్ స్టేషన్లలో సోమవారం మల్కాజిగిరి ఎంపీ స్థానానికి పోలింగ్ జరుగనుంది. కొత్తపేట డివిజన్‌లో 50,307 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ సారి మారిన పోలింగ్ స్టేషన్(బూత్)లను ప్రజయ్ నివాస్ ఫేజ్ -1, 2, ఆర్‌బీఐకాలనీ, బాలాజీనగర్, రాఘవేంద్రకాలనీ, జనప్రియ క్వార్టర్స్, స్నేహపురికాలనీల ఓటర్లు గుర్తించాలని ఎన్నికల సూపర్‌వైజింగ్ ఆఫీసర్ మాత్యనాయక్ తెలిపారు. సత్యానగర్ కాలనీలోని ప్రియభారతి హైస్కూల్‌లో (బూత్ నెం.8,9,10), మోహన్‌నగర్‌లోని జీనియస్ గ్రామర్ స్కూల్ రూమ్ నెం.1(బూత్ నెం.5), సెయింట్ జార్జి స్కూల్(బూత్ నెం.6), జనప్రియ క్వార్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనం(బూత్ నెం.7), స్నేహపురికాలనీ సీనియర్ సిటిజన్స్ భవనం(బూత్ నెం. 82)లో నూతనంగా పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారన్నారు.

మలక్‌పేట అసెంబ్లీ సెగ్మెంట్‌లో 3,15,631 మంది ఓటర్లు

● 300 పోలింగ్ బూత్‌లలో ఏర్పాట్లు పూర్తి ● 98 సమస్యాత్మక పోలింగ్ బూత్‌ల గుర్తింపు

చాదర్‌ఘాట్, మే12(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే మలక్‌పేట అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో సోమవారం జరగనున్న పోలింగ్‌కు ఎన్నికల అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఆదివారం ఉదయం నుంచి పోలింగ్ సిబ్బందికి అవసరమైన ఎన్నికల సామగ్రిని సమకూర్చి అంబర్‌పేటలోని జీహెచ్‌ఎంసీ ఇండోర్ స్టేడియం నుంచి పోలింగ్ బూత్‌కు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. మలక్‌పేట అసెంబ్లీ సెగ్మెంట్‌లో 3,15,631 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అందులో 1,59,182 మంది పురుష ఓటర్లు, 1,56,434 మంది మహిళ ఓటర్లు, 15మంది ఇతర ఓటర్లు ఉన్నారు. 300 పోలింగ్ బూత్‌ల కోసం 1500 మంది ఎన్నికల సిబ్బందిని ప్రత్యేకంగా నియమించారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి 31మంది అభ్యర్థులు బరిలో ఉండగా వీరి కోసం ఒక్కో పోలింగ్ బూత్‌లో రెండు పోస్టల్ బ్యాలెట్ యూనిట్‌లు, ఒక వీవీ ప్యాట్, ఒక కంట్రోల్ యూనిట్‌ను ఓటర్లు ఓటు వేసేందుకు ఏర్పాట్లు చేసేందుకు 300 పోలింగ్ బూత్‌లను సిద్ధం చేశారు. ఇందులో 98పోలింగ్ బూత్‌లు సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. ఈ పోలింగ్ బూత్‌ల లోపల వెబ్ కాస్టింగ్, పోలింగ్ బూత్ బయట వెబ్‌లతో నిరంతర నిఘా ఏర్పాటుకు సిద్ధం చేశారు. 160మంది మైక్రో అబ్జర్వర్లను ప్రత్యేకంగా నియమించినట్లు మలక్‌పేట ఏఆర్‌వో రాజేష్‌కుమార్ తెలిపారు. 300 పోలింగ్ బూత్‌ల కోసం 27రూట్‌లలో 27మంది సెక్టోరల్ ఆఫీసర్లను ప్రత్యేకంగా నియమించామన్నారు. ప్రతీ ఒక్క ఓటరు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని, అందుకు గాను ఓటు వేసేందుకు రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా నిరభ్యంతరంగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోలింగ్ బూత్‌కు 100 మీటర్ల వరకు పూర్తిగా నిషేదాజ్ఞలు అమలులో ఉంటాయన్నారు. ఏదేని గుర్తింపు కార్డుతో ఓటర్లు ఓటు వేసేందుకు పోలింగ్ బూత్‌లకు రావాలని ఆయన సూచించారు.



పోలింగ్ సామగ్రితో పోలింగ్ బూత్‌లకు వెళ్లేందుకు సిద్ధమైన సిబ్బంది



సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో పోలింగ్ సిబ్బంది



సరూర్‌నగర్ స్టేడియం నుంచి పోలింగ్ సామగ్రిని తీసుకెళ్తున్న సిబ్బంది



బస్సుల్లో పోలింగ్ సామగ్రితో విధులకు వెళ్తున్న సిబ్బంది

కాంగ్రెస్‌లో చేరిన బీఎస్పీ నేత శ్రీనివాస్

సరూర్‌నగర్, మే 12(ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్‌కు చెందిన బీఎస్పీ మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడు గుడ్ల శ్రీనివాస్‌మహారాజ్ ఆదివారం ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. గతంలోనూ కాంగ్రెస్ నాయకుడిగా కొనసాగిన ఆయన ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత ఆ పార్టీలో చేరారు. అయితే ఆర్‌ఎస్పీ బీఎస్పీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరడంతో అసంతృప్తి వ్యక్తం చేసిన గుడ్ల శ్రీనివాస్.. తాను కాంగ్రెస్‌లో చేరబోతున్నట్టు ఇటీవల ప్రకటించారు. ఈక్రమంలో ఆదివారం ఆయన మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ సమక్షంలో హస్తం గూటికి చేరుకున్నారు. కార్యక్రమంలో కర్రె కృష్ణ, కోల శ్రీనివాస్, గుడ్ల జ్ఞానేశ్వర్, అఖిల్ పాల్గొన్నారు.



కేఎల్లార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న గుడ్ల శ్రీనివాస్

మార్కెట్‌లోకి మారుతీ సుజుకీ న్యూ స్విఫ్ట్ కారు

కొత్తపేట: మారుతీ సుజుకీ ఇండియా ది ఎపిక్ న్యూ స్విఫ్ట్ కారు హైదరాబాద్‌లో మార్కెట్‌లోకి విడుదల చేసింది. నగరశివారు ఎల్‌బీనగర్ కామినేని క్రాస్ రోడ్స్‌లో మారుతీ సుజుకీ ఎరినా కళ్యాణీ మోటర్స్ షోరూమ్‌లో టాలీవుడ్ నటి, బిగ్‌బాస్‌ఫేమ్ శ్రీసత్య ఆవిష్కరించారు. ఆమె టీ.సీ.ఎం.సూర్య, కళ్యాణి మోటార్స్ సీఈఓ వెంకటేశ్వర్‌రావు, బ్రాంచి ఏజీఎం. రాజ్‌కుమార్‌లతో కలిసి మారుతీ సుజికీ ది ఎపిక్ న్యూ స్విఫ్ట్ కారును మార్కెట్‌లోకి విడుదల చేసిన అనంతరం తొలి ఐదుగురు కొనుగోలుదారులకు నూతన మాడల్ కార్ల తాళం చెవులను అందజేశారు.



న్యూ స్విఫ్ట్ కారును ఆవిష్కరిస్తున్న బిగ్‌బాస్‌ఫేమ్ శ్రీసత్య

పట్టపగలు ఇంట్లోకి చొరబడ్డ ఆగంతుకుడు

● వృద్ధురాలిని బెదిరించి బంగారు గొలుసు లాక్కొని పరారీ



పరుగు తీస్తున్న అనుమానితుడు

పంజాగుట్ట, మే 12 (ఆంధ్రజ్యోతి): పట్టపగలు ఓ ఆగంతుకుడు ఇంట్లోకి చొరబడ్డాడు. వంట గదిలో ఉన్న వృద్ధురాలిని బెదిరించి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసు లాక్కుని పారిపోయాడు. ఈ ఘటన పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిగూడ శాలివాహననగర్ కాలనీలోని ఓ ఇంట్లో విజయలక్ష్మి(75) నివసిస్తోంది. ఆదివారం వంటగదిలో వంట చేస్తుండగా పక్క ఇంట్లో నుంచి ఓ ఆగంతుకుడు గోడ దూకి ఆమె ఇంట్లోకి వచ్చాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో వంటగదిలో ఒంటరిగా ఉన్న విజయలక్ష్మిని బెదిరించాడు. ఆమె కేకలు వేయకుండా నోరు మూసేశాడు. వృద్ధురాలి మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు గొలుసు లాక్కొని పారిపోయాడు. బాధితురాలు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. వారు ఇంటికి చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు. పంజాగుట్ట ఏసీపీ ఎస్. మోహన్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ శోభన్, డీఐ క్రాంతికుమార్ ఘటనా స్థలాన్ని సందర్శించారు. బాధితురాలిని అడిగి వివరాలు తెలుసుకుని ఆధారాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలించారు. ఆగంతుకుడు ఓ హాస్టల్‌లోకి వెళ్లడంతో, అతడి ఫోన్ నంబర్, చిరునామా సేకరించారు. సాంకేతిక ఆధారాలతో అతడిని అదుపులోకి తీసుకొని బంగారు గొలుసు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

బడంగ్‌పేట్ బాలాజీ కోవెలలో..


నేటి నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

● 15న స్వామివారి తిరు కల్యాణోత్సవం, 17న రథోత్సవం

సరూర్‌నగర్, మే 12(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్‌లోని పద్మావతీ అలిమేలుమంగా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలను ఈనెల 13వ తేదీ సోమవారం నుంచి 18వ తేదీ శనివారం వరకు వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు చక్రవర్తుల జగన్‌మోహనాచార్యులు, మదన్‌మోహనాచార్యులు తెలిపారు. ఈ ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరుకానున్న నేపథ్యంలో అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నట్టు వారు పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాలకు ముందు ఈనెల 10,11,12 తేదీల్లో మూడు రోజుల పాటు అధ్యయనోత్సవాలు శాస్త్రోక్తంగా నిర్వహించామని, సోమవారం నుంచి బ్రహ్మోత్సవాల క్రతువు ఆరంభమవుతుందని వారు చెప్పారు.

13 నుంచి 18 వరకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు

వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 13వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నిత్యం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు పలు ఆధ్యాత్మిక, భక్తి కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భజనలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని ఆలయ ధర్మకర్తలు తెలిపారు. ఇక 15వ తేదీ బుధవారం రోజున ఉదయం 11గంటలకు స్వామి వారి తిరుకల్యాణోత్సవం ఉంటుందని, రాత్రి ఏడు గంటలకు గరుగవాహన పల్లకీసేవ తదితర కార్యక్రమాలు ఉంటాయని వారు వివరించారు. శుక్రవారం 17వ తేదీ నాడు ఉదయం నుంచి సాయంత్రం దాకా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించి, రాత్రి 7గంటలకు స్వామి వారి రథోత్సవం నిర్వహించనున్నట్టు వారు పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ధర్మకర్తలు కోరారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు వారు పేర్కొన్నారు.



ఆలయంలో కొలువుదీరిన పద్మావతీ అలిమేలుమంగా సమేత వేంకటేశ్వరస్వామి

అక్రమంగా విక్రయిస్తున్న మద్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న అక్రమ మద్యం

చంపాపేట: కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మిధానీ డిపో సమీపంలోని గుడిసెల్లో అక్రమంగా నిల్వఉంచి విక్రయిస్తున్న మద్యాన్ని శనివారం రాత్రి, ఆదివారం ఉదయం వేర్వేరుగా పట్టుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డి తెలిపారు. గుడిసెల్లో కిరాణాషాప్ నిర్వహిస్తున్న జ్యోతి(38)అనే మహిళ విక్రయానికి నిల్వ ఉంచిన రూ.80,190 విలువైన 72.90లీటర్ల మద్యం, మరో మహిళ కేతావత్ జ్యోతి(35), నేనావత్ తిరుపతి(30) ఇంటి నుంచి రూ.3412 విలువైన 13.65లీటర్ల మద్యంను స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.